సాక్షి రంగారెడ్డి

శుక్రవారం ¦ 20 ¦ అక్టోబర్ ¦ 2023



ప్రజల ఆశీర్వాదం బీఆర్‌ఎస్‌కే

రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కే ప్రజల ఆశీర్వాదం ఉందని, మూడోసారి గెలుపు ఖాయమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. 10లో▸



బీజేపీ విజయం ఖాయం

బీఆర్‌ఎస్ మోసపూరిత పాలనకు త్వరలోనే చరమగీతం తప్పదని బీజేపీ సీనియర్ నాయకుడు తల్లోజు ఆచారి అన్నారు. 10లో▸



ప్రకృతిని ఆరాధించే పండుగ

ప్రకృతిలో లభించే పూలను ఆరాధించే పండుగ బతుకమ్మ అని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ అన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

అసైన్డ్ భూములపై సంపూర్ణ హక్కులు కల్పించాలి



ఉప్పరి శ్రీనివాస్

మొయినాబాద్: అసైన్డ్ భూములపై సంపూర్ణ హక్కులు కల్పించాలని అసైన్డ్ భూమి సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మొయినాబాద్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో అసైన్డ్ భూములపై స్పష్టమైన ప్రకటన చేయలేదన్నారు. దళితులకు అసైన్డ్ భూములపై హక్కులు కల్పిస్తానని పేర్కొన్నారని.. కానీ రాష్ట్రంలో అసైన్డ్ భూములు కేవలం దళితులకే లేవని.. అన్ని వర్గాల పేదలకు ఉన్నాయన్నారు. కులాల వారీగా చూస్తే రాష్ట్రంలో బీసీలకే అధికంగా ఉన్నాయని, దీనిపై సీఎం కేసీఆర్ పునరాలోచన చేయాలన్నారు. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో అన్నివర్గాల వారికి అసైన్డ్ భూములపై సంపూర్ణ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే అసైన్డ్ భూమి సమితి ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

అన్ని హంగులతో పాఠశాల పునర్నిర్మాణం



చందనవెల్లి పాఠశాలలో అమేజాన్ ప్రతినిధుల బృందం

షాబాద్: అమేజాన్ వెబ్ సర్వీస్ సహకారంతో పాఠశాలను పునర్నిర్మించినట్టు సంస్థ సీఈఓ అవినాశ్, సెర్ఫ్ ఆర్గనైజేషన్ ఎండీ పార్థసారథి పేర్కొన్నారు. మండల పరిధిలోని చందనవెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పునర్నిర్మించిన పాఠశాలను గురువారం సర్పంచ్ కొలను ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి పేద విద్యార్థులకు అన్ని హంగులతో పాఠశాల నిర్మాణం చేసినట్లు తెలిపారు.అంగన్‌వాడీ కేంద్రాన్ని సైతం అదే రీతిలో తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,వార్డు సభ్యులు, గ్రామస్తులు,విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ దొంగలపై పీడీయాక్ట్ నమోదు చేస్తాం


పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్



డీటీ రఘునందన్

ఆమనగల్లు: రేషన్ బియ్యం తక్కువధరకు కొని అధికధరకు విక్రయించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ హెచ్చరించారు. ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆమనగల్లు పోలీసుస్టేషన్ పరిధిలో ఈ ఏడాది 9 కేసుల్లో 50 క్వింటాళ్లకు పైగా రేషన్‌బియ్యం అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డాయని తెలిపారు. ఆమనగల్లు పోలీసుస్టేషన్‌లో ఫిబ్రవరిలో ఒక కేసు, మార్చిలో రెండు, ఏప్రిల్, మేలో ఒక్కో కేసు, జూన్, జూలైలో రెండు కేసుల చొప్పున నమోదయ్యాయని వివరించారు. గ్రామాల్లో కొందరు వ్యాపారులు తిరుగుతూ ప్రజల వద్ద రేషన్‌బియ్యాన్ని తక్కువధరకు కొనుగోలు చేసి అధికంగా విక్రయిస్తూ అక్రమ వ్యాపారం సాగిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. రేషన్‌బియ్యం అక్రమ రవాణా కేసులో పట్టుబడ్డ నిందితుల డ్రైవింగ్ లైసెన్స్ రద్దు కోసం రవాణాశాఖకు సిఫారసు చేయనున్నట్లు వివరించారు.

పోలీసుల తనిఖీల్లో రూ.5 లక్షలు పట్టివేత



స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న పోలీసులు

కొత్తూరు: ఎన్నికల నేపథ్యంలో గురువారం చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.5లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శంకర్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా హైదరాబాద్‌కు చెందిన నవనీత్ అగర్వాల్ తన కారులో రూ.5లక్షలు తరలిస్తున్నట్లు గుర్తించారు. దీనికి సంబంధించి ఎలాంటి రసీదులు, పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.



కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రచార రథం



ప్రచారం కోసం సిద్ధమవుతున్న వాహనాలు



ప్రచార రథం ఆకర్షణ మంత్రం

ప్రచార హోరుకు రథాలు ముస్తాబు

- ఆయా పార్టీల ప్రత్యేక దృష్టి
- అత్యాధునిక హంగులతో తయారు
- ఓటర్లను ఆకట్టుకునేలా సిద్ధం
- రూ.లక్షల్లో ఖర్చు చేసేందుకు వెనుకాడని అభ్యర్థులు

యాచారం: ఎన్నికలు అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది ప్రచారమే.. ఓటర్లను అన్ని రకాలుగా ఆకర్షించేందుకు ఎవరి శైలిలో వారు ప్రచారం సాగిస్తుంటారు.. ఈ ప్రచార ఘట్టంలో ప్రస్తుతం ప్రధాన భూమిక పోషిస్తున్నాయి ప్రచార రథాలు. అందుకే చూడగానే ఆకట్టుకునేలా అభ్యర్థులు పోటాపోటీగా వీటిని సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే అధికార బీఆర్‌ఎస్ తమ అభ్యర్థులను, కాంగ్రెస్ పార్టీ తొలి జాబితా ప్రకటించడంతో ఆయా పార్టీ అభ్యర్థులు ప్రచారం షురూ చేశారు. బీజేపీ, బీఎస్పీ, వామపక్షాలు తమ అభ్యర్థులు అధికారికంగా ప్రటించకపోయినప్పటికీ ఆశావహులు.. ప్రచారం సాగిస్తూనే ఉన్నారు. ఎవరికి వారు తమ ప్రచారం విభిన్నంగా ఉండేలా చూసుకుంటున్నారు. జనాన్ని ఆకర్షించేందుకు ప్రచార రథాలపై ప్రధానంగా దృష్టి పెడుతున్నారు. ఇందు కోసం రూ.లక్షల్లో ఖర్చు చేయడానికి కూడా వెనుకాడడం లేదు.

ఓటర్లను ఆకట్టుకునే రీతుల్లో ..

పోటీ అభ్యర్థులు ప్రచార రథాలను వినూత్నంగా, ఓటర్లను ఆకట్టుకునే రీతుల్లో తయారు చేయించుకుంటున్నారు. గతంలో జీపులు, ఆటో రిక్షాలకు సాధారణ మైకులు పెట్టుకొని గ్రామాల్లో, కాలనీల్లో తిరిగి ప్రచారాలు సాగించే వారు. ప్రస్తుతం ట్రెండ్ మారిపోయింది. ప్రచారరథం పైకి ఎక్కితే సకల సౌకర్యాలు ఉండేలా ఏర్పాటు చేసుకుంటున్నారు. 250 వాట్స్‌ల ఆహుజ మైక్, రథానికి నాయకుల చిత్రపటాలు, కార్డులెస్ మైకు, కార్డుతో కూడిన మైకు రథంపై ఐదు నుంచి పది మంది ముఖ్యులు నిల్చొనేలా డయాస్, టైటిల్స్, చుట్టూ రెయిలింగ్స్, వాటర్‌ప్రూఫ్ కార్పెట్లు, పైన నిలబడి మాట్లాడే నాయకుడు కనిపించేలా ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. నగరంతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు నుంచి వీటిని ప్రత్యేకంగా తెప్పించుకుంటున్నారు.

సుజికి ఫేమస్..

ప్రచార రథాల తయారీకి సుజికి వాహనాలను ఎక్కువగా వాడుతున్నారు. రాజకీయ నాయకుల ప్రచారానికి ఇవి అనుకూలంగా ఉంటున్నాయి. గతంలో ప్రచారంలో ఉన్న మహేంద్ర, బొలేరో వాహనాలకు బదులు వీటిని వినియోగిస్తున్నారు. తమ పార్టీల అధినేతల ఫొటోలు, గుర్తులతో ఆకర్షించేలా రథాలను తయారు చేసుకుంటున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈ వాహనాలు 16 దేశాల్లో ప్రధానంగా క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ వాహనాలను కొనుగోలు చేస్తే రోడ్డు టాక్స్ మినహాయించడంతో ఎక్కువగా కొంటున్నట్లు నిపుణులు చెబుతున్నారు.

రూ.లక్షల ఖర్చుతో..

జిల్లాలోని పలు నియోజవర్గాల్లో వివిధ పార్టీల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసే నేతలు రూ.లక్షల్లో ఖర్చు చేసి ప్రచార రథాలను తెప్పించుకుంటున్నారు. ఒక్కో అభ్యర్థి రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు వీటి కోసం వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి, షాద్‌నగర్, చేవెళ్ల, మహేశ్వరం, ఎల్‌బీనగర్ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ తదితర పార్టీల నుంచి పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్న నేతలు వీటిని సమకూర్చుకుంటున్నారు. ప్రచార రథాలతో పాటు కళాకారుల బృందాలను సిద్ధం చేసుకుంటున్నారు. అన్ని పార్టీల అభ్యర్థుల తుది జాబితాలు ఖరారు కాగానే ప్రచారం ఊపందుకోనుంది.

పోలింగ్ కేంద్రం పరిశీలన



తుక్కుగూడలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ భారతి హోళికేరి

తుక్కుగూడ: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ భారతి హోళికేరి గురువారం పరిశీలించారు. మౌలిక వసతుల గురించి ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటర్లు తమ ఓటును నిర్భయంగా వినియోగించుకోవడానికి అవసరమైన సౌకర్యాలను కల్పించాలన్నారు. కలెక్టర్ వెంట కందుకూరు ఆర్డీవో సూరజ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రాం, మేనేజర్ వెంకటేశం, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

కారెక్కిన స్వతంత్ర కార్పొరేటర్



మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన గౌరీశంకర్ తదితరులు

మీర్‌పేట: కార్పొరేషన్‌లో ఎంతో అభివృద్ధి చేయడంతో పాటు రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి తెలిపారు. 2వ డివిజన్ స్వతంత్ర కార్పొరేటర్ కొంద్ర గౌరీశంకర్‌తో పాటు అంబేద్కర్‌నగర్ వాసులు గురువారం సాయంత్రం మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మేయ ర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, పార్టీ మీర్ పేట అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బజ్జీలు మీకు.. ఓట్లు మాకు: ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఓ మిర్చిబండి వద్ద బజ్జీలు వేస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

పక్కాగా ఎన్నికలు నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం: ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆదేశించారు. ఇబ్రహీంపట్నంలోని ఆర్యవైశ్యసంఘంలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఎల్‌ఓలు పోలింగ్ కేంద్రాల వద్ద ఏమైనా సమస్యలుంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, ఎన్నికల యాప్‌ను ఏవిధంగా ఉపయోగిస్తున్నారో అక్కడున్న బీఎల్‌ఓను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ అన్వర్, ఆర్ఐ పుష్పలత, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

మంచాల: ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ కోసం చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. మంచాల మండలం ఆరుట్ల, ఎల్ల మ్మ తండాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు ఇబ్బంది లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేలా చూ డాలన్నారు. వివాదాస్పద గ్రామాల్లో ముందస్తుగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా పెట్టాలని సూచించారు. మండలంలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సౌకర్యాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 31వ తేదీ వరకు అర్హులైన వారు ఓటర్లుగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఆమె వెంట ఆర్డీఓ హన్మంత్‌రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, సీఐ కాశీ విశ్వనాథ్, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ వెంకట్ ప్రసాద్ ఉన్నారు.



ఇబ్రహీంపట్నంలోని ఆర్యవైశ్య సంఘంలో ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

అనుమానిత అకౌంట్లపై నిఘా ఉంచాలి

- జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా బ్యాంకుల్లో జరిగే డిజిటల్ లావాదేవీల్లో అనుమానిత, లెక్కకు మించిన నగదు అకౌంట్లపై నిఘా ఉంచి వాటి సమాచారాన్ని ప్రతి రోజు ఉదయం 10 గంటలలోపు పంపించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ సూచించారు. గురువారం ఆయా బ్యాంకుల మేనేజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూపీఐ (గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే) ద్వారా ఒక అకౌంట్ నుంచి ఎక్కువ అకౌంట్లకు నగదు ట్రాన్స్‌ఫర్ అయ్యే సమాచారాన్ని తెలియజేయాలన్నారు. ఏటీఎంలలో నగదు డిపాజిట్ చేయడానికి వినియోగించే వాహనాలకు ఆయా బ్యాంకులు తప్పనిసరిగా జీపీఎస్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నట్లు, బ్యాంకు అధికారులు తరలిస్తున్న నగదుకు తప్పనిసరిగా డాక్యుమెంట్లు, క్యూఆర్ కోడ్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగదుకు సంబంధించి రసీదులను తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. డిప్యూటీ ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు లక్ష రూపాయలకు మించిన నగదు లావాదేవీలపై సమాచారం అందించాలన్నారు. సమావేశంలో నోడల్ ఆఫీసర్ శరత్ చంద్ర, అడిషనల్ కమిషనర్ (ఎలక్షన్స్) శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి దొరికిపోయారు

- ఇంటి నిర్మాణ అనుమతికి రూ.1.5 లక్షలు లంచం
- టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నిర్వాకం



ఉమ



లక్ష్మణ్

ఎల్‌బీనగర్: ఇంటి నిర్మాణ అనుమతికి లంచం డిమాండ్ చేసిన హయత్‌నగర్ టౌన్ ప్లానింగ్ అధికారితో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం పట్టుకున్నారు. గుర్రంగూడకు చెందిన జక్కిడి సుధాకర్‌రెడ్డి బీఎన్‌రెడ్డి నగర్‌లో ఇంటి నిర్మాణ అనుమతి కోసం హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకోసం టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ఉమను సంప్రదించారు. ఇంటి నిర్మాణ అనుమతికి రూ.2 లక్షలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. రూ.1.5 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. విషయాన్ని సుధాకర్‌రెడ్డి ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. సరూర్‌నగర్‌లోని హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో సుధాకర్‌రెడ్డి నుంచి రూ.1.5 లక్షలు టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ ఉమ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి లక్ష్మణ్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ మాజీద్ అలీ తదితర అధికారులు పట్టుకున్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మీర్‌పేట: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయ మని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ ప్రగతినగర్, సాయినగర్, రాఘవనగర్, మల్‌రెడ్డి రంగారెడ్డినగర్ కాలనీల్లో గురువారం స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చెప్పేవన్నీ చేస్తుందని, గెలిపిస్తే ఇందిరమ్మ రాజ్యం వస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకునేందుకు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మీర్‌పేట అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

జంట హత్యల కేసులో యావజ్జీవ శిక్ష

- తీర్పునిచ్చిన జిల్లా అదనపు న్యాయస్థానం





మీరెడ్డి మట్టారెడ్డి, ఎండీ ఖాజా మొహినొద్దీన్



బూరి భిక్షపతి

ఇబ్రహీంపట్నం: భూవివాదాల నేపథ్యంలో జరిపిన కాల్పుల్లో దారుణ హత్యకు గురైన ఇద్దరు రియల్టర్ల కేసులో ముగ్గురికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జిల్లా 3వ అదనపు న్యాయస్థానం గురువారం తీర్పును వెలువరించింది. 1, మార్చి, 2022లో జరిగిన కాల్పుల ఘటన అప్పట్లో ఇబ్రహీంపట్నంలో తీవ్ర కలకలం రేపింది. మండలంలోని చర్లపటేల్‌గూడ రెవెన్యూ పరిధిలో పెద్దచెరువు సమీపంలో లేక్ విల్లా అర్చర్డ్స్ పేరుతో ఫాంల్యాండ్ చేసి ప్లాట్లు విక్రయించారు. నగరంలోని చైతన్యపురి, కమలానగర్‌లో నివసించే మీరెడ్డి మట్టారెడ్డి ఇందులో ప్లాట్లను కొనుగోలు చేశారు. పక్కనే ఉన్న మరో 10 ఎకరాలను అల్మాస్‌గూడకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి, మీర్‌పేట పరిధిలో నివసించే కోమటిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తీసుకొని భూమిని చదును చేసి బోర్లు వేసి వ్యవసాయ పొలంగా మార్చారు. ఈ నేపథ్యంలో మట్టారెడ్డితో శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డికి భూవివాదం తలెత్తింది. శ్రీనివాస్‌రెడ్డిని ఎలాగైనా అడ్డుతొలగించుకోవాలని మట్టారెడ్డి ప్లాన్ వేశారు. ఇందుకు అనుగుణంగా మార్చి ఫస్టు, 2022 రోజున భూవివాదంపై మాట్లాడుకుందామని సైట్‌కు రమ్మని శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్ చేసి చెప్పారు. కోమటిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, నవారి శ్రీనివాస్‌రెడ్డి కారులో సైట్(ప్లాట్ల) వద్దకు వచ్చి మట్టారెడ్డితో మాట్లాడి తిరిగి వెళ్తుండగా ముందుగా వేసుకున్న పథకం ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి కారుపై తుపాకీతో కాల్పులు జరిపారు. తప్పించుకొని శ్రీనివాస్‌రెడ్డి పారిపోతుండగా పట్టుకొని తుపాకీతో కాల్చడంతో కుప్పకూలిపోయాడు. అప్పటికి తూటాలు రాఘవేందర్‌రెడ్డి ఛాతిలోకి దిగగా కారులో పరారయ్యేందుకు యత్నించాడు. తీవ్ర గాయాలైన అతను కొద్ది దూరంలోనే కారులోనే స్పృహ కోల్పోయాడు. వెంటనే దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. చికిత్స కోసం రాఘవేందర్‌రెడ్డిని ఆస్పత్రికి తరలించగా మృతిచెందారు. డబుల్ మర్డర్ కేసును ఉన్నతాధికారులు ప్రెస్టేజీగా తీసుకుని విచారణ చేపట్టారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన చైతన్యపురిలో నివసించే మట్టారెడ్డి అలియాస్ సత్తిరెడ్డిని(43) అదుపులోకి తీసకొని విచారించారు. కృష్ణా జిల్లా జనార్దనపురానికి చెందిన ఎండీ ఖాజా మొహినొద్దీన్ (34), మెదక్ జిల్లా కొండపాక మండలం కుకునూర్‌పల్లికి చెందిన బూరి భిక్షపతి(32)ల పాత్రను గుర్తించి అరెస్టు చేసి అప్పట్లో రిమాండ్‌కు తరలించారు. 20 నెలల పాటు ఈ కేసు పూర్వాపరాలు పరిశీలించిన జిల్లా న్యాయస్థానం ముగ్గురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసును ఛేదించి, ఆధారాలతో నిందితులకు శిక్ష పడేందుకు కృషిచేసిన పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

నీటికుంటలో జారిపడి..

మహిళ మృతి



జ్యోతి మృతదేహం

తలకొండపల్లి: దుస్తులు ఉతుకుతూ ప్రమాదవశాత్తు కాలుజారి నీటికుంటలో (ఫాంపాండ్) పడి ఓ మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ శ్రీను తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని పూల్‌సింగ్‌తండాకు చెందిన పాత్లావత్ జ్యోతి (30).. గురువారం వ్యవసాయ పొలంలో ఉన్న ఫాంపాండ్ వద్ద దుస్తులు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటికుంటలో పడింది. దీంతో ఊపిరాడక మృతిచెందింది. మృతురాలి భర్త శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బెల్టుషాపులపై పోలీసుల దాడి



మద్యం సీసాలతో ఇస్లావత్ బాలు

అబ్దుల్లాపూర్‌మెట్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలిచారు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలోని బ్లాక్‌నెం.11/8లోని ఓ కిరాణా దుకాణంలో అధిక ధరకు మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దుకాణంపై దాడి చేయగా రూ.11వేల విలువ చేసే మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. నిర్వాహకుడు ఇస్తావత్ బాలును అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

ప్రజల ఆశీర్వాదం బీఆర్‌ఎస్‌కే

కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



మాడ్గుల: బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

మాడ్గుల: రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కే ప్రజల ఆశీర్వాదం ఉందని, రాష్ట్రంలో మూడవసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. రాష్ట్రంలో విపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకు ప్రజల మద్దతు లేదన్నారు. గురువారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏమిరెడ్డి జైపాల్‌రెడ్డి అధ్యక్షతన మండల కేంద్రంలో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. సభకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సభలో జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాయని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ప్రజల సంక్షేమం కోసం అనేక వినూత్న పథకాలు అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. సీఎం కేసీఆర్ మరోసారి ప్రజల కోసం అద్భుతమైన మేనిఫెస్టోను ప్రకటించారని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీకి ఒక్కసీటు కూడా రాదని విమర్శించారు. కల్వకుర్తిలో కలిసికట్టుగా మరోసారి బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేద్దామన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు జంగయ్యగౌడ్, మార్కెట్ డైరెక్టర్లు నిరంజన్, సుభాష్, మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, సర్పంచులు యాదిరెడ్డి, యాదయ్య, జంగయ్య, ఎంపీటీసీ సభ్యులు బ్రహ్మం, నాయకులు లాలయ్యగౌడ్, వెంకటేశ్వర్లు, రాజవర్ధన్‌రెడ్డి, దర్మారెడ్డి, రమేశ్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

'నాలుగోసారి జైపాల్‌యాదవ్‌నే గెలిపిద్దాం'

తలకొండపల్లి: నియోజకవర్గ ఎమ్మెల్యేగా నాలుగోసారి జైపాల్‌యాదవ్‌నే గెలిపించి గులాబీ జెండా ఎగురవేస్తామని మిషన్ భగీరథ కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్‌గుప్తా అన్నారు. గురువారం మండల పరిధిలోని చీపునుంతల, తుమ్మలకుంటతండాల్లో ఆయన పర్యటించి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌గుప్తా మాట్లాడుతూ.. జీవితాన్ని ప్రజా సేవకే అంకితమిచ్చిన జైపాల్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్ర సీఎంగా కేసీఆర్ నేతృత్వంలోనే సంక్షేమ ఫలాలు అర్హులకు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిర్మణీ నిర్మలాశ్రీశైలంగౌడ్, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాసుయాదవ్, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ నర్సింహ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు గోపాల్‌నాయక్, సర్పంచ్‌లు రఘుపతి, లక్ష్మణ్‌నాయక్, నరోత్తంరెడ్డి, వెంకటయ్య, బాలకుమార్‌గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శంకర్, శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే.. మరింత అభివృద్ధి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఎన్నికల ప్రచారం ఖర్చుల కోసం ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న మల్లమ్మ కుటుంబీకులు

చేవెళ్ల: చేవెళ్ల అభివృద్ధికి ఎంతో కృషి చేశానని.. మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేసేందుకు పాటుపడుతానని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చేశానన్నారు. కేసీఆర్ సీఎం అయితే గ్రామాలు మరింతగా అభివృద్ధి చెందుతాయన్నారు. ఇతర పార్టీలు చేప్పే మాయ మాటలు నమ్మవద్దని.. గతంలో ఉన్నప్పుడు చేయలేని వారు ఇప్పుడు చేస్తామంటే ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.మాలతి, నాయకులు ఎం.బాల్‌రాజ్, రమణారెడ్డి, కృష్ణారెడ్డి, ప్రభాకర్, తిరుపతిరెడ్డి, సుదర్శన్, కృష్ణ, నర్సింలు, సత్తయ్య, రవికాంత్‌రెడ్డి, దండు సత్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు చెక్కు అందజేత

చేవెళ్లలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలె యాదయ్యకు చేవెళ్లకు చెందిన దండు మల్లమ్మపెంటయ్య కుటుంబసభ్యులు ఎన్నికల ఖర్చుకోసం రూ.51,116 చెక్కును అందజేశారు. ఈ సారి కూడా బీఆర్‌ఎస్ పార్టీయే అధికారంలోకి రావాలని ఎమ్మెల్యేగా కాలె యాదయ్యనే గెలువాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కృతజ్ఞతలు తెలిపారు.

అధికారమే లేకుండా 'గ్యారెంటీ'లా?

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి
- ప్రతీ హామీ నెరవేరుస్తాం: నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి తీగల కృష్ణారెడ్డి

తుర్కయంజాల్: బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమైంది.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే గ్యారెంటీనే లేదు.. ఇంకా హామీలు ఎందుకు అని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం తుర్కయంజాల్‌లోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నాలుగు గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేయించామని దీంతో అభివృద్ధిలో దూసుకుపోతున్నాయనన్నారు. చిన్న చిన్న తప్పిదాలతో తుర్కయంజాల్ మున్సిపల్ సీటు కోల్పోయామని అయినప్పటికీ అభివృద్ధి నిలిచిపోకుండా పనులు చేపట్టామని గుర్తుచేశారు. భవిష్యత్ దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థ పనులను చేపట్టామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీని ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, కేసీఆర్ మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతీ హామీని నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని, ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, రైతు బంధు జిల్లా అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కల్యాణ్ నాయక్, సీనియర్ నాయకులు భీంరెడ్డి, ముత్యంరెడ్డి, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

ముమ్మరంగా వాహనాల తనిఖీ



యాచారం: మాల్‌లో సాగర్‌రోడ్డుపై తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ ప్రసాద్, సిబ్బంది

యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ, యాచారం పోలీసులు సాగర్ రోడ్డుపై ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. మాల్ చెక్ పోస్టు వద్ద గురువారం ఎస్‌ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనదారులు ఎన్నికల నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. రశీదులు లేకుండా తరలించే డబ్బు, నగదును స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

రూ.4.10 లక్షలు పట్టివేత

వాహనాల తనిఖీల్లో భాగంగా గురువారం యాచారం పోలీసులు రూ.4.10 లక్షలు పట్టుకున్నారు. మల్కీజ్‌గూడకు చెందిన వ్యాపారి రమేశ్ యాచారం నుంచి మల్కీజ్‌గూడలోని తన ఇంటికి వస్తుండగా కారులో నగదును పట్టుకున్నారు.

వాహన తనిఖీల్లో రూ.1.15 లక్షలు స్వాధీనం

ఇబ్రహీంపట్నం: ఎన్నికల కోడ్ నేపథ్యంలో గురువారం ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలోని ఉప్పరిగూడ వద్ద నిర్వహించిన తనిఖీల్లో రూ.1.15లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్‌ఐ మైబెల్లి తెలిపారు. కారును తనిఖీ చేయగా అందులో లభించిన డబ్బును రిటర్నింగ్ అధికారికి అప్పగించామన్నారు.

బాలికను వేధిస్తున్న యువకుడికి రిమాండ్



అబ్బు(ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్న ఓ యువకుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. తారమతిపేట గ్రామానికి చెందిన సయ్యద్ అబ్బాస్ అలీ అలియాస్ అబ్బు (19) అదే గ్రామానికి చెందిన ఓ బాలికను ప్రేమ పేరుతో కొన్ని రోజులుగా వేధిస్తున్నాడు. బాలిక తల్లిదండ్రులు అబ్బును మందలించారు. అయినప్పటికీ అబ్బు తీరు మారకపోవడంతో పాటు బాలిక తండ్రిని వాహనంతో ఢీకొట్టేందుకు యత్నించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు అబ్బుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

నిమ్స్‌లో డెంటల్ క్లినిక్..

స్పెషాలిటీ బ్లాక్ రూమ్ నెం.11 నుంచి సేవలు

లక్డీకాపూల్: నిజాం వైద్య విజ్ఞాన సంస్థ(నిమ్స్)ను పేద ప్రజలకు మరింతగా అందుబాటులోకి తెచ్చేందుకు వైద్య విభాగాలను విస్తరిస్తున్నామని డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప అన్నారు. గురువారం ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డెంటల్ సర్వీసెస్ సేవలను ప్రారంభించారు. స్పెషాలిటీ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లోని రూమ్ నెం.11 నుంచి దంత వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డెంటల్ క్లినిక్ సేవలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్లు డా.ఎన్.లక్ష్మీ భాస్కర్, డా.కేవీ.కృష్ణారెడ్డి, అసోసియేట్ డీన్ డా.సాయి సతీష్, డాక్టర్ సాయి బాబా, ఏపిఆర్‌ఓ ఆషారాణి, దంత వైద్యనిపుణులు మహమ్మద్ క్వాజా మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులు అదృశ్యం



అబ్బాస్ (ఫైల్)



అంజయ్య (ఫైల్)

శంషాబాద్: ఇద్దరు వేర్వేరు వ్యక్తులు అదృశ్యమైన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. పట్టణంలోని మోహిన్ మహల్లాలో నివాసముంటన్న ఖాజాబాయి అలియాస్ అబ్బాస్ ఈ నెల 15న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లాడు. దీంతో కుటుంబసభ్యులు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫరూఖ్‌నగర్ మండలం బుచ్చిగూడెం గ్రామానికి చెందిన మాదే అంజయ్య (58)బుధవారం శంషాబాద్ పట్టణానికి వచ్చి తిరిగి ఇంటికి చేరుకోలేదు. అన్ని చోట్లా వెతికినా ఆచూకి లభించకపోవడంతో కుటుంబసభ్యులు గురువారం రాత్రి ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బీజేపీ విజయం ఖాయం

- కేసీఆర్ పాలనకు చరమగీతమే
- ఎన్నికల ప్రచారంలో తల్లోజు ఆచారి



ప్రచారం చేస్తున్న ఆచారి

కడ్తాల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాగిస్తున్న మోసపూరిత పాలనకు ప్రజలు త్వరలోనే చరమగీతం పాడుతారని బీజేపీ సీనియర్ నాయకుడు తల్లోజు ఆచారి అన్నారు. మండల మండల పరిధిలోని బాలాజీనగర్, రేకులకుంటతండా, సాలార్‌పూర్, చల్లంపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. తొమ్మిదేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆచారి మాట్లాడుతూ.. రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రం అనేక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాయ మాటలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోందన్నారు. బీఆర్‌ఎస్ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారని స్పష్టంచేశారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమన్నారు. 35 సంవత్సరాలుగా ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలతో అలుపెరగని పోరాటం సాగిస్తున్నానని తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో కల్వకుర్తిలో బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్, మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి వీరయ్య, సర్పంచ్ సుగుణ సాయిలు, నాయకులు రాందాస్‌నాయక్, రెడ్యానాయక్, భగీరథ్, వెంకటేశ్, లక్ష్మణ్, సాయి ప్రభు, రమేశ్, యాదగిరి కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.

ప్రకృతిని ఆరాధించే పండుగ



బతుకమ్మ వేడుకలలో మాట్లాడుతున్న వీర్లపల్లి శంకర్

- భక్తిశ్రద్ధలతో బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవాలి
- కాంగ్రెస్ పార్టీ షాద్‌నగర్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ రూరల్: ప్రకృతిలో లభించే పూలను ఆరాధించే పండుగ బతుకమ్మ పండుగ అని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో గురువారం రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సంబరాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్, కేశంపేట జెడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మహిళలందరికీ ఎంతో ఇష్టమైన పండుగ బతుకమ్మ అన్నారు. ప్రకృతి పూలను పూజించి జరుపుకొనే ఏకైక పండుగ బతుకమ్మ అని తెలిపారు. తెలంగాణలో మాత్రమే జరుపుకొనే పూల పండుగ బతుకమ్మ అన్నారు. బతుకమ్మ పండుగతో ప్రజల బతుకులు బాగుపడాలని ఆకాంక్షించారు. దుర్గామాత చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని అన్నారు. ఈ విజయ దశమి వేడుకలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, రెడ్డి జాగృతి నాయకురాలు అరుందతి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను గురువారం జిల్లా కలెక్టర్ భారతి హోలికేరి పరిశీలించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాల, కళాశాల భవనాల్లో ఏర్పాటు చేయనున్న కేంద్రాలను ఆమె పరిశీలించి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాల్సిన వాటి గురించి తహసీల్దార్ నాగమణి, మున్సిపల్ భోగీశ్వర్లుతో చర్చించారు. గందరగోళం లేకుండాఏర్పాటు సజావుగా పూర్తిగా చేయాలని అధికారులను ఆదేశించారు.